

# పెళ్ళిచూపులు

ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

పెళ్లి చూపులు జరుగుతున్నాయి. ఆనందరావు అమ్మాయి పొడవైన నల్లని జుట్టు వంక చూస్తున్నాడు తదేకంగా.

"ఏమైనా అడుగుతావా, బాబూ?" అన్నాడు పెళ్లికూతురు తండ్రి.

ఏం మాట్లాడలేదు ఆనందరావు.

"అమ్మాయి బి.ఏ. చదివింది. వంట బాగా వచ్చు. అవసరం అయితే ఉద్యోగం కూడా చేస్తుంది!" అన్నాడు పొడిగిస్తూ తండ్రి.

"నాకు ఉద్యోగం అక్కరలేదు!" అన్నాడు.

'హమ్మయ్య!' అనుకున్నాడు మనసులో పిల్ల తండ్రి. ఇంతవరకూ వచ్చినవాళ్లంతా ఉద్యోగం లేదని తిరిగి వెళ్లినవారే.

"వంటే కాదు, సంగీతం కూడా బాగా వచ్చు, బాబూ!" అంది పిల్ల తల్లి.

'అలాగా' అన్నట్లు చూశాడు. కానీ పాడమనలేదు.

'హమ్మయ్య!' అనుకుంది కమల. ఎంత బాగా వచ్చినా, పాడమంటే పాడటం కష్టం అందరి ముందూ.

పిల్లవాడి ధోరణి అంతుపట్టడంలేదు పిల్ల తరఫువారికి. అందం పట్టింపు లేదంటాడు. ఉద్యోగం వద్దంటాడు. ధనవంతులు. కట్నం అడగటంలేదు. ఒక్కడే కొడుకు. బాదరబందీ లేదు. ఈ సంబంధం కుదిరితే బాగుండునని ఉంది అందరికీ. కానీ పిల్లవాడు తేల్చటంలేదు. ఏదో అడగబోయినట్లుంటాడు కానీ, అడగడు, తేల్చడు.చివరికి నిర్ణయించుకున్నట్లు అడిగాడు

"మీ అమ్మాయి జుట్టు....!" ఆపాడు.

"సొంతమే బాబూ! మా ఇంట్లో అందరివీ పెద్ద జుట్లే!" అంది తల్లి. ఆమెది కూడా పెద్ద జుట్టే.

"అది కాదు..." మళ్లీ నానబెట్టాడు.

"మరి....?" అంది తల్లి. "నవరం కాదు..." అని కూడా ఆపింది.

తలూపాడు. మళ్లీ మాట్లాడలేదు.

కమలకి విసుగొస్తోంది. చేసుకున్నా, చేసుకోకపోయినా, ఇంతసేపు ఎవరూ తనని కూర్చోబెట్టలేదు. ఇతడు చేసుకుంటాడో, లేదో దేముడెరుగు కానీ, గంటయింది ఎవరూ లోపలకి వెళ్లమనటంలేదు. సమయం గడుస్తోంది.

"నేను వెళ్లనా, నాన్నా?" అంది చివరికి కమలే.

తండ్రి సందిగ్ధంగా చూశాడు.

చివరికి పిల్లవాడి తల్లి అందుకుంది. "మా వాడు అడగలేకపోతున్నాడు. ఈ రోజుల్లో అందరూ జుట్టుకి రంగు వేస్తున్నారు కదా! మీ అమ్మాయి జుట్టు చాలా నల్లగా ఉంది. అందుకే వాడికి అనుమానంగా ఉంది!" అంది.

కమల మొహం ఎర్రబడింది.

"అబ్బెబ్బే.... అదేం లేదండీ! ఒరిజినల్!" అంది పిల్ల తల్లి తడబడుతూ కంగారుగా.

"ఆ విషయంలో మాత్రం మా అబ్బాయికి చాలా పట్టింపు సుమా! వాడికి తెల్లజుట్టు అంటే అసలు ఇష్టంలేదు. ఒకవేళ ఏమైనా తేడా వస్తే, వదిలేసినా వదిలేస్తాడు పెళ్లయినా కూడా! ఆ ఒక్క విషయంలో మాత్రం వాడికి చాలా పట్టింపు. అందులో అబద్ధం లేకపోతే మాత్రం ఈ పెళ్లి మా కిష్టమే!" అంది ఖచ్చితంగా తల్లి.

"అయ్యో, నిజమే చెబుతున్నామండీ!" అంది తల్లి కొంత అవమానంగా, కొంచెం ఆనందంగా.

పెళ్లి జరిగింది. భర్త, అత్త మామలు కమలని అపురూపంగా చూడసాగారు. కాలు కిందపెట్టనీయడంలేదు. హనీమూన్ వెళ్లారు. తిరిగి వచ్చారు. ప్రపంచం అంతా రంగులమయంగా, అందంగా, ఆనందంగా ఉంది. పుట్టింటివారు కొంచెం మధ్యతరగతివాళ్లు. అక్కడ ప్రేమ ఒక్కటే. ఇక్కడ ప్రేమ, డబ్బు, దర్జా, విలువ అన్నీనూ. కమల ఆనందానికి అంతు లేదు.

హనీమూన్ నుంచి రాగానే భర్త స్నానానికి వెళ్లాడు చిరాగ్గా ఉందని. ఎంతకీ బయటకు రాకపోతే విసుగొచ్చి కమల తలుపు తట్టింది. "అయిందా?" అడిగింది.

"లోపలకి రా, తీసే ఉంది!" అన్నాడు.

"ఛీ! సిగ్గు లేదూ!" అంది కమల సిగ్గుపడుతూ.

"నువ్వు రా, చెబుతాను!" అన్నాడు.

కమల కొద్దిగా తలుపు తోసింది. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు. అద్దంముందు నిలబడి ఉన్నాడు ఆనందరావు. అతని ముందు హెయిర్ డ్రై, బ్రెష్, దువ్వెన వగైరా సరంజామా ఉన్నాయి.

"ఇదేమిటీ? మీరు తలకి రంగు వేస్తారా?" అంది ఆశ్చర్యంగా.

"అవును!" అన్నాడు.

"మరి మీకు తెల్లజుట్టంటే అసహ్యం అన్నారుగా!" అంది.

"అవును అసహ్యమే!" అన్నాడు.

"మరి...?" అంది.

"మరి ఏముందీ? అందుకే నల్లని జుట్టు ఉన్న అమ్మాయిని చేసుకున్నాను. మా ఇంట్లో అందరికీ తెల్లజుట్టే. నాకైతే ఇరవయ్యవ ఏటే నెరిసింది పూర్తిగా. అమ్మా, నాన్నకి కూడా అంతే. అందుకే కనీసం చేసుకునే వాళ్లకైనా నల్ల జుట్టు అయితే జీన్స్ ప్రభావం కనీసం పిల్లలమీదైనా కొంతయినా ఉంటుందని ఆశ!" అన్నాడు.

"అయితే అత్తయ్యగారూ, మామయ్యగారూ కూడా ..." అంది ఆశ్చర్యంగా.

"అవును. ఇక నా పెళ్లయింది కాబట్టి వాళ్లు ఇక రంగు వేసుకోవాటం మానెయ్యాలని అనుకుంటున్నారు. అది సరే కానీ, వెనకాల కొంచెం సరిగా వెయ్యి, అందటంలేదు. అందుకే పిలిచాను!" అన్నాడు.

"మీరు కూడా మానెయ్యండి. నాకేం పట్టింపు లేదు. ఆరోగ్యానికి మంచిది కాదంటారు కదా ఇది!" అంది.

"అమ్మో! తెల్ల జుట్టంటే నాకసహ్యం!"

అతన్ని చూసి జాలిపడాలో, నవ్వాలో తెలియలేదు. మనిషి వ్యక్తిత్వానికి జుట్టు ఒక్కటే నిదర్శనం కాదు కదా! అయినా అతను బాధపడతాడని ఆ మాట పైకి అనలేదు. అంతేకాదు, అతని ఆ ఆలోచనలవల్లే కదా తనకి ఇంత మంచి మొగుడు కట్నం లేకుండా దొరికాడు! లేకపోతే, తమ మధ్యతరగతి కుటుంబానికి ఇంత మంచి సంబంధం రాదు కదా! అనుకుంటూ అతనికి ఆ చిన్న లోపాన్ని పెట్టిన దేముడికి కృతజ్ఞత తెలుపుకుంటూ బ్రష్ అందుకుంది కమల. ■

# 60 ఏళ్ల తీరిన కోరిక



**1935**లో వాషింగ్టన్ రాష్ట్రం సియాటిల్ నగరంలో ఓ ఫ్యాక్టరీలో పనిచేసే ట్రావిస్ కాబ్‌రాన్... నవోమి బ్రాన్‌టన్ అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఇద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగింది. అయితే పెళ్లికి ముందే అతను పనిచేసే కంపెనీ ఓ కొత్త ఫ్యాక్టరీని స్థాపించడానికి ఇతన్ని మిన్నియాపొలిస్ అనే ఊరికి బదిలీ చేశారు. నవోమికూడా తర్వాత వెళ్లాలి కానీ, వెళ్లలేదు. దాంతో ట్రావిస్ ఇంకో అమ్మాయితో ప్రేమలోపడి, ఎంగేజ్‌మెంట్ రద్దు చేస్తున్నట్లుగా లెటర్ రాశాడు. అది చదివి ఆమె ఏడ్చింది.

అయితే ఇతనికి అర్థమైంది తను తొందరపడ్డానని. మళ్లీ నవోమిని కలిసి, ఆ సంగతి చెప్పి, ఆమె ఒప్పుకుంటే తన భార్యకి విడాకు లిచ్చేసి నవోమిని చేసుకుంటానని చెప్పడానికి వెళ్లాడు. కానీ నవోమికి అప్పటికే ఇంకొకరితో వివాహం అవడంతో, ఈసారి ఏడవడం ఇతని వంతయింది.

1995 దాకా ఆ ఇద్దరు మళ్లీ ఒకరినొకరు తారసపడలేదు. తన భర్త మరణించాక ట్రావిస్ ఎక్కడున్నాడో నవోమి వెదికి పట్టుకుంది. అప్పటికే అతని భార్యకూడా మరణించడంతో అతను బ్రహ్మచారిగానే ఉన్నాడు.

వాళ్లు ఒకరినొకరు చూసుకున్న మూడోరోజు వివాహం చేసుకున్నారు. 60 ఏళ్ల తర్వాత వాళ్ల కోరిక ఫలించింది. 1935లో ఎంగేజ్‌మెంట్, 1995లో వివాహం. ఈ సంఘటనను అమెరికన్ దినపత్రికలు, టీ.వీ.లు కవర్ చేశాయి.

-ఎం. లిపి